## క్లుప్తంగా

### ఘనంగా మారెమ్మవ్వ దేవర



ఇబ్రహీంపురంలో మారెమ్మవ్వకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

నందవరం : మండలంలోని ఇబ్రహీంపురం, కొట్బాల గ్రామాల్లో విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మారెమ్మవ్వ దేవర ఘనంగా జరిగింది. గ్రామ దేవతలకు కుంభాలు, బలిదానలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.సర్పంచ్ నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ బీసమ్మ పాల్గొన్నారు.

### తిక్కస్వామి దర్గా ఉత్సవాలు ప్రారంభం

ఆదోని సెంట్రల్: పట్టణంలో వెలిసిన తిక్కస్వామి దర్గా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు భక్తులు గంధం, పూలచాదర్‌ను ఊరేగింపు తీసుకొచ్చి దర్గాలో సమర్పించారు. మంగళవారం ఉరుసు జరుగుతుందని దర్గా నిర్వాహకులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

### వేతన జీవులకు నిరాశే

ఆదోని సెంట్రల్: వేతన జీవులకు ఉగాది, రంజాన్ పండుగలు నిరాశ మిగిల్చాయని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ బి.వీరచంద్రయాదవ్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అయినా డీఏలు, పీఆర్‌సీ, మధ్యంతర భృతిపై ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. పండుగల సమయంలో ప్రకటన వస్తుందని ఉద్యోగులు ఆశగా ఎదురుచూసినా నిరాశే ఎదురయ్యిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డీఏలు, పీఆర్‌సీ, మధ్యంతరభృతిపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

### 13న అంతర్రాష్ట్ర గిరక పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని కడిమెట్ల గ్రామంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి జాతరను పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీన అంతర్రాష్ట్ర గిరక బండి పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎంపీపీ గొల్ల కేశన్న, మునిస్వామి, బజారి, నరసప్ప, నాయుడు, రామలింగడు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో జర్సీ ఎద్దుల తప్ప అన్ని రకాల ఎద్దులు పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన ఎద్దులకు వరుసగా..రూ. 25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే జట్లు రూ.వెయ్యి ఎంట్రీ ఫీజు 12వ తేదీ సాయంత్రం లోపు చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని చెప్పారు. వివరాలకు సెల్ 9652839474, 9390613477 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ఏబీవీపీ క్యాలెండర్ల ఆవిష్కరణ

ఆదోని అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆదోని శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర ఉగాది క్యాలెండర్లను వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐల చేతుల మీదుగా సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కర్నూలు జిల్లా కన్వీనర్ వీరేష్ మాట్లాడుతూ.. ఏబీవీపీ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ అని, అనేక విద్యా సమస్యలపై పోరాటాలు చేసి పరిష్కరించిందన్నారు. జాతీయవాదం, దేశభక్తిని విద్యార్థుల్లో నింపి ఎంతోమందిని నాయకులుగా తీర్చిదిద్దిందన్నారు. నాయకులు గోవిందరాజ్, ఉమామహేష్ పాల్గొన్నారు.

### అగ్నిపత్‌కు ఎంపిక

కోసిగి: స్థానిక వడ్డె వీధిలో ని వాసం ఉంటున్న వడ్డె గోవిందు, నాగలక్ష్మి దంపతుల కు మారుడు యువరాజు అగ్నిపత్‌కు ఎంపికయ్యాడు. తండ్రి తాపీ మేస్త్రీ, తల్లి కూలీ పనుల కు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. యువరాజు 1–5వ తరగతి వరకు కుమ్మరి వీధి ప్రాథమిక పాఠశాల, 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుకున్నాడు. ఇంటర్ పూర్తి కాగానే దేశానికి సేవా చేయాలనే ధృడ సంకల్పంతో ఆర్మీకి వెళ్లాలని పట్టుదలతో కృషి చేశారు. ప్రస్తుతం ఎంఈజీ బెంగళూరుకు శిక్షణ నిమిత్తం వెళ్తున్నాడు.

### పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



శానిటరీ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్తను పారవేయవద్దని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని అర్ధగేరి బసవన్నగౌడ్‌లో పరిసరాలను పరిశీలించారు. ప్రధాన కూడళ్లు, సర్కిళ్లు, మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. పరిశుభ్రతతోనే ఆరోగ్య జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



ఆదోని: జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఆదోని: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మత గురువులు



ఎమ్మిగనూరు ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



ఈద్గాలో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బుట్టా శివనీలకంఠ

# భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ఈద్గాల్లో ప్రార్థనలు చేసిన ముస్లింలు
- రంజాన్ విశిష్టతను వివరించిన మత పెద్దలు
- ప్రార్థనల అనంతరం వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన



పెద్దపెండేకల్ గ్రామంలో..



ఎమ్మిగనూరు ఈద్గాలో దైవప్రవచనాలు వివరిస్తున్న మతగురువు మహమ్మద్‌బాషా సాహెబ్ ఖాద్రీ



ఎమ్మిగనూరు ఈద్గాలో ప్రత్యేక నమాజులో పాల్గొని దువా చేస్తున్న ముస్లింలు

ఆదోని సెంట్రల్: రంజాన్ పండుగను సోమవారం ఆదోని నియోజకవర్గ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని షాహి జామియా మసీదు, చందశా దర్గా, ఇమామ్ దర్గా, గుల్బరోజ్ దర్గాలతో పాటు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్రమైన దివ్య ఖురాన్ అనుగుణంగా ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలతో అల్లాను ఆరాధిస్తూ ఆధ్యాత్మిక జీవితం గడిపారు. క్రమశిక్షణ, దైవ చింతన, దాతృత్వం, ధార్మిక చింతనలు కలిగి ఉండడమే రంజాన్ మాసం విశిష్టత అని గురువులు తెలిపారు. ప్రార్థనలు అనంతరం చిన్నాపెద్ద ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికీ అల్లాహ్ అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.

ఆదోని రూరల్: ఆదోని మండలంలోని ముస్లింలు ఆయా ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. పెద్దపెండేకల్, సాంబగల్, సుల్తానాపురం, మాంత్రికి, పెద్దతుంబళం, ఇస్వీ, కడితోట, ఆన్వాల్, పెద్దహరివాణం, మదిరె, సంతెకూడ్లూరు, నాగనాథనహళ్లి, గోనబావి,మండిగిరి తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల పాలు ఉపవాస దీక్షలు ఉండి అల్లాను స్మరిస్తూ భక్తిని చాటుకున్నారు.సోమవారంతో ఉపవాస దీక్ష ముగియడంతో దర్గాలు, ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

**అందరూ సుఖసంతోషాలతో ఉండాలి**

ఆదోని టౌన్: అల్లాహ్ దయతో ముస్లింలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం రంజాన్‌ను పురస్కరించుకుని పలువురు ముస్లింలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ముస్లింలు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేసి భక్తిభావం చాటుకున్నారని తెలిపారు. ఆ దేవుడి ఆశీస్సులు వారిపై ఉండాలని ఆకాంక్షించారు.

ఎమ్మిగనూరుటౌన్: ఖురాన్ పఠనం ప్రతి ముస్లిం జీవితంలో భాగం కావాలని అప్పుడే వారి జీవితాల్లో అల్లా వెలుగులు నింపుతాడని మత గురువు మహమ్మద్‌బాషా సాహెబ్ ఖాద్రీ పేర్కొన్నారు. పట్టణంలో ని కమిటీ రోడ్డులోనున్న ప్రధాన ఈద్గాతో పాటు, ఎస్‌బీఐ వద్దనున్న ఈద్గా, పలు మసీదులకు ముస్లింలు ఉదయాన్నే వెళ్లి ప్రత్యేక సామూహిక రంజాన్ నమాజులు చేశారు. కమిటీ రోడ్డులోనున్న ఈద్గాలో మత గురువు ఖాద్రీ ఈద్-ఉల్-ఫితర్ విశిష్టతను వివరిస్తూ దైవ ప్రవచనాలను వినిపించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డ్ బిల్లును తేనుండటంతో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొని నిరసన తెలిపారు.

**శుభాకాంక్షలు..**

ఆయా ఈద్గాల్లో ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, వీరశైవలింగాయత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి



సాయిప్రసాద్‌రెడ్డిని సత్కరించిన ముస్లింలు



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ముస్లింలు



నందవరంలో..

గోనెగండ్ల: మండల కేంద్రం, గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలను ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు ఖతీబ్ రెహమాన్ పవిత్ర రంజాన్ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఎంపీపీ టి. నసురుద్దీన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆక్టివీటి కార్యదర్శి బందెనవాజ్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్‌ను ముస్లింలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి..**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల అనంతరం చేతులకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఎస్‌బీ మన్సూర్, చికెన్ రాజా మాట్లాడుతూ వక్ఫ్ చట్టం అమలు చేయడం ద్వారా ముస్లింలు నష్టపోతామని తెలిపారు.

నందవరం : మండలంలో ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, మండల సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, వైఎస్ ఎంపీపీ నడిపి షేక్ సాహెబ్ ముస్లింలకు శుభాంకాంక్షలు తెలిపారు.

మంత్రాలయం : మంత్రాలయంలో ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. షేక్ ఇమామ్ ఖాజా బందేనమాజ్ ఆధ్వర్యంలో తెల్లవారుజామును పాత ఊరు జామియా మజీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంతో పాటు మండల గ్రామాల్లో ప్రత్యేక భక్తి గీతాలు ఆలపిస్తూ ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో మతగురువులు అబ్దుల్ రహిమాన్, లతీఫ్ స్థానిక మసీద్ నుంచి ఈద్గా దగ్గరకు వెళ్లి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం పండుగ ప్రత్యేకతను వివరించారు.

కోసిగి: స్థానిక జామియా మసీద్, నూరాణి సున్నీ మసీద్, మదీనా మసీద్, మసీదే ఎఅక్సా నుంచి ముస్లింలు ర్యాలీగా వెళ్లి రైల్వే గేటు సమీపంలో ఈద్గా వద్ద మత గురువు జాకీర్ మౌలానా నేతృత్వంలో ప్రత్యేక నమాజ్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ఈద్గా దగ్గరకు చేరుకుని ముస్లింలకు శుభకాంక్షలు తెలిపారు.

కౌతాళం: తెల్లవారు జామున ఐదు గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత ఉదయం 8.00 గంటలకు మసీదులకు చేరి తక్బీర్ చదువుకుంటూ ఈద్గాకు చేరి సామూహిక ప్రత్యేక ప్రార్థనాలు జరిపారు. సన్మార్గంలో నడిచి అల్లా కృపాకు పాత్రులు కావాలని మతపెద్దలు తెలయజేశారు. స్థానిక ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ఖాజీసాబు నమాజు విశిష్టత వివరించారు. జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలోని ఈద్గాలో ప్రత్యేక నమాజులు ఆచరించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఉశేని చిష్టీ భక్తులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



మంత్రాలయంలో నమాజు చేస్తున్న ముస్లింలు



మత గురువు జాకీర్ మౌలానాకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కోసిగిలో ఈద్గా దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లీం సోదరులు



పెద్దకడబూరులో ఈద్గా వద్దకు ప్రత్యేక గీతాలను ఆలపిస్తూ వెళ్తున్న ముస్లిలు



కౌతాళంలో ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు

## ఉల్లాసంగా ఉగాది హోలీ వేడుకలు





వల్లూరులో వసంతోత్సవంలో పాల్గొన్న యువకులు, నదిచాగి గ్రామంలో రంగులు చల్లుకుంటున్న యువకులు

కౌతాళం: ఉగాది వేడుకల్లో భాగంగా సోమవారం మండలంలోని గ్రామాల్లో వసంతోత్సవం ఉల్లాసంగా జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది మరుసటి రోజున పశ్చిమ ప్రాంత గ్రామాల ప్రజలు ఉగాది హోలీగా జరుపుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగానే ఆదివారం ఉగాది జరుపుకోగా సోమవారం ఉగాది హోలీ సందర్భంగా ప్రజలు ఒకరిపై ఒకరు రంగులను చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు గ్రామాలైన మేళిగనూరు, నదిచాగి, వల్లూరు, కౌతాళం, బాపురం, కాత్రికి, మరళి, గుడికంబాలి, కుంబళనూరు, హాల్వి గ్రామాలలో యువకులు, పిల్లలు వేడుకల్లో పాల్గొన్నారు.

## గార్లదిన్నెలో గడ్డివాముల దగ్ధం



కాలిబూడిదైన గడ్డివాములు



తీవ్రంగా గాయపడిన కోడెదూడ

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవటంతో మూడు గడ్డివాములు దగ్ధం కాగా, మూడు పశువులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు...గ్రామానికి చెందిన పెద్ద ఈరన్న, చిన్న ఈరన్నకు చెందిన గడ్డి వాములు ఇళ్లపక్కనే ఉన్నాయి. ఉదయం ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకోవటంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గమనించిన గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేస్తు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మంటలు ఎగిసిపడుతుండంతో దొడ్డిలో కట్టేసిన రెండు కోడెదూడలు, ఒక బర్రెకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు మంటలును ఆర్పుతుండగానే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే గడ్డివాములు కాలిబూడిదయ్యాయి. దాదాపు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోయారు.

## ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమే



మార్కెట్‌యార్డు సెక్రెటరీని సన్మానిస్తున్న యార్డు అధికారులు

ఆదోని అర్బన్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని, విధి నిర్వహణలో మంచిపేరు తెచ్చుకున్నప్పుడే ఆ పదవికి గుర్తింపు వస్తుందని కమీషన్ ఏజెంట్, కాటన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సోమవారం యార్డులో ఆయన్ను ఘనంగా సన్మానించారు. వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదాయం పెంపునకు, అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, సీనియర్ అసిస్టెంట్లు అశోక్‌కుమార్, శ్రీనివాసులు, సూపర్‌వైజర్‌లు జ్ఞానప్ప, మోహన్‌రెడ్డి, రాము, ఆనంద్‌కుమార్, నాగరాజు, శివ నరేష్ పాల్గొన్నారు.

## స్థలదాతకు సన్మానం




కొత్త కైరవాడిలో పఠాన్ వజ్రకాన్ దంపతులను సన్మానించిన గ్రామస్తులు

నందవరం : మండలంలోని కొత్త కైరవాడి గ్రామంలో శ్మశాన స్థలదాత పఠాన్ వజ్రకాన్, మొద్దీన్ బీ దంపతులను గ్రామ పెద్దలు శాలువ, పూలమాలతో సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామానికి దాదాపు 30 ఏళ్ల కిందట శ్మశాన వాటికకు స్థలం లేకపోవడంతో వజ్రకాన్ గతంలో సర్వే నంబర్ 193బీలో 64 సెంట్లు దానం చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా వారిని గ్రామ పెద్దలు వెంకటేష్, ఉప సర్పంచ్ చాంద్‌బాషా, టి. నాగేంద్ర, కిష్టప్ప, కురవ నాగేంద్ర, ఈరన్న, దేవదాసు, ఆనంద్, రాజు సన్మానించారు.

## సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఓ మహిళను కత్తితో బెదిరించిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదైంది. గత నెల 27వ తేదీ ప్రశాంత్‌నగర్‌కు చెందిన పద్మావతి అనే మహిళ ఇంట్లోకి సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ శాంతరాజు వెళ్లాడు. కత్తి చూపించి తలుపులు, సామాన్లు ధ్వంసం చేశాడు. వారిని భయభ్రాంతులకు గురిచేశాడు. పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

## చలివేంద్రం ఏర్పాటు




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బుట్టా శివనీలకంఠ,

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, నాయకులు విరుపాక్షిరెడ్డి, వెంకటేష్, శివప్రసాద్, రాజశేఖర్, సునీల్‌కుమార్, నరసింహులు, పాలశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**అంబేడ్కర్ సేవా రత్న అవార్డు ప్రదానం**

ఆదోని రూరల్: మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మహానంది, ఆదోని డివిజన్ అధ్యక్షుడు బసాపురం యల్లప్ప, మాల భరత్‌లకు రాష్ట్ర మాలల ఉద్యోగుల సంఘం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అంబేడ్కర్ సేవా రత్న అవార్డులను అందజేశారు. ఒంగోలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. మాలల కోసం చేసిన ఉద్యమాలకు గాను ఈ అవార్డులు అందజేసినట్లు చెన్నకేశవులు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు తెలిపారు.

## రమణీయం.. గిడ్డాంజనేయస్వామి రథోత్సవం





పూజలందుకుంటున్న గిడ్డాంజనేయస్వామి,తారాపురంలో అశేష భక్త జనుల మధ్య రథోత్సవం

- జై శ్రీరాం నామస్మరణతో మార్మోగిన తారాపురం



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు : మండలంలోని తారాపురం గ్రామంలో వెలసిన శ్రీ గిడ్డాంజనేయస్వామి రథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. పెద్దకడబూరు, ఆదోని చుట్టుపక్క గ్రామాల నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధికంగా తరలి వచ్చిన భక్తులతో గ్రామం కిటకిటలాడింది. జైశ్రీరాం నామస్మరణతో గ్రామం పులకించి పోయింది. తెల్లవారుజామున ఆలయ పూజార్లు స్వామి వారికి జలాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్పార్చన, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా గొళ్ల వీరారెడ్డి ఇంటి నుంచి కుంభం ఊరేగింపుగా రథం వరకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఓంకారప్ప స్వామి ఇంటినుంచి ఉత్సవమూర్తులు, గజమాలతో ఊరేగింపుగా వచ్చి రథానికి ప్రత్యేకంగా అలంకరించి ఉత్సవ మూర్తులను రథంపై అధిష్టింపేజేసి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. రథాన్ని తిమ్మప్పతాత గుడిదగ్గరికు లాగి యథాస్థానానికి చేర్చారు. రథోత్సవంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నిరంజన్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు విజయేంద్రరెడ్డి వేడుకల్లో పాల్గొని స్వామివారికి ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. నాయకులు భీంసేన్‌రావ్ కౌశిక్, అనుమేష్ స్వామి పాల్గొన్నారు.